పెన్ పవర్

ఆదివారం అనుబంధం

అక్టోబర్ 12, 2025




# ఉక్కు మహిళకు శాంతి కిరీటం

## లోపలి పేజీల్లో..


### కవర్ పేజీ..




### టీనేజర్లూ.. వైబ్ కోడింగ్ నేర్చుకోండి!

06



కేవలం 19 ఏళ్ల వయసులోనే స్కేల్ ఏఐ అనే అంకుర సంస్థను స్థాపించాడు. 24 ఏళ్లలోనే బిలియనీర్‌గా అవతరించి రికార్డు సృష్టించాడు. తాజాగా 28 ఏళ్ల వయసులో ప్రముఖ కృత్రిమ మేధ సంస్థ మెటా ఏఐ సీఈవో బాధ్యతలు చేపట్టి మరోసారి వార్తల్లోకి ఎక్కాడు. అతనే అలెగ్జాండర్ వాంగ్. స్వయంకృషితో వ్యాపారవేత్తగా ఎదిగిన ఆయన ఇటీవల 'వైబ్ కోడింగ్' నేర్చుకోవాలని 13 ఏళ్ల పిల్లలకు సందేశం ఇచ్చారు.

### 'పాఠశాలల్లో యూపీఐ చెల్లింపులు'.. రాష్ట్రాలకు కేంద్రం లేఖ

10




మన దేశంలో పెద్దమొత్తంలో డిజిటల్ లావాదేవీలు ( జరుగుతున్నాయి. యూపీఐ వినియోగం విస్తృతమైంది. ఈ క్రమంలోనే పాఠశాలల్లో ఫీజుల వసూలు ప్రక్రియను కూడా ఆధునీకరించాలని కేంద్ర విద్యాశాఖ రాష్ట్రాలను కోరింది. పారదర్శకతను పెంచడంతోపాటు ఫీజుల చెల్లింపును సులభతరం చేసేందుకు యూపీఐ వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించింది. యూపీఐ, నెట్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ చెల్లింపులకు ఆదరణ పెరుగుతున్న వేళ ఇటువంటి ప్రకటన చేయడం ఇదే తొలిసారి.

### నూనె లేకున్నా రుచిగానే..



10

పూరీలంత కాకున్నా.. దోశలు కూడా నూనె పీల్చుకుంటాయి. కానీ వీటిని నూనె లేకుండానూ చేసుకోవచ్చు. నూనె సరిపడని వారికి.


# విశాఖ, ముంబయికి.. మెటా సముద్రగర్భ కేబుల్..?



ప్రపంచంలోనే అతిపెద్ద సముద్రగర్భ కేబుల్ అయిన 'ప్రాజెక్ట్ వాటర్‌వర్త్‌కు భారత్‌నూ అనుసంధానం చేసేందుకు మెటా చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఇందుకోసం మన దేశంలో రెండు నగరాలను ల్యాండింగ్ ప్రదేశాలుగా ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ముంబయి, విశాఖపట్నంలో ఈ కేబుల్‌ను డాకింగ్ చేయనున్నట్లు సమాచారం. ఈమేరకు కంపెనీ విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఎకనామిక్ టైమ్స్ కథనం వెల్లడించింది.

ఈ కీలక ప్రాజెక్ట్ కోసం భారత్‌లో తమ ల్యాండింగ్ భాగస్వామిగా సైఫీ టెక్నాలజీస్‌ను మెటా నియమించుకున్నట్లు ఆ కథనం పేర్కొంది. 5 మిలియన్ డాలర్లతో ఈ ఒప్పందం జరిగినట్లు సమాచారం. అయితే, దీనిపై మెటా (%వీమ్మ%) గానీ, సైఫీ గానీ ఇంతవరకూ స్పందించలేదు. మరోవైపు, గూగుల్ కూడా భారత్‌లో తన 400 మిలియన్ డాలర్ల బ్లూ-రామన్ సముద్రగర్భ కేబుల్ కోసం సైఫీతోనే ఒప్పందం చేసుకున్న సంగతి తెలిసిందే.దక్షిణాసియా దేశాల్లో ఇంటర్నెట్ డేటాకు డిమాండ్ పెరుగుతోన్న నేపథ్యంలో గత మూడేళ్లుగా భారత్‌లో సముద్రగర్భ కేబుల్ రంగంపై ఆసక్తి పెరిగింది. ఇప్పటికే రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్ వంటి దేశీయ దిగ్గజ సంస్థలు కేబుల్ సిస్టమ్స్‌పై పెద్దఎత్తున పెట్టుబడులు పెడుతున్నారు. ఇప్పుడు మెటా, గూగుల్ వంటి అంతర్జాతీయ కంపెనీలు కూడా ఆసక్తి కనబరుస్తున్నాయి. వచ్చే 5-10 ఏళ్లలో మెటా కేబుల్ సిస్టమ్ భారత్‌లో 10 బిలియన్ డాలర్ల వరకు పెట్టబడులు పెట్టే అవకాశం ఉందని కాలిఫోర్నియాకు చెందిన ఓపెన్ కేబుల్స్ సంస్థ వ్యవస్థాపకుడు సునీల్ తగారే అభిప్రాయపడ్డారు.

ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా ఇరుదేశాల సంయుక్త నేతలు ఈ ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. ఈ వాటర్ వర్త్ కింద.. ప్రపంచంలోని 5 ప్రధాన ఖండాలను కలుపుతూ 50,000 కిలోమీటర్లకు పైగా కేబుల్‌ను ఏర్పాటుచేయనున్నారు. ఇది భూమి చుట్టుకొలత (40,075 కి.మీ) కంటే ఎక్కువ. ఈ కేబుల్‌కు నౌకల లంగర్లు, ఇతర ప్రమాదాల వల్ల ఇబ్బందిలేకుండా అధునాతన సాంకేతికత వినియోగించి 7,000 మీటర్ల లోతున బలంగా వేస్తున్నారు.

ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత సామర్థ్యంతో, మెరుగైన సాంకేతికతతో ఏర్పాటుచేస్తున్న ఈ సముద్రగర్భ కేబుల్‌తో భారత్, అమెరికా, ఇతర ప్రాంతాలను అనుసంధానిస్తామని గతంలో మెటా ప్రతినిధి ఒకరు వెల్లడించారు. ఇంటర్నెట్ కార్యకలాపాలకు సముద్రగర్భ కేబుళ్లు కీలకం. దేశాలు పరస్పరం ఈ కేబుళ్లతోనే అనుసంధానమవుతాయి. స్థానిక టెలికాం ఆపరేటర్లు ఈ కేబుళ్లకు అనుసంధామై తమ వినియోగదారులకు ఇంటర్నెట్‌ను అందిస్తుంటాయి.

## పక్షవాతం నుంచి బయటపడొచ్చిక...



06

## దూమ్మడే కొట్టుకురాలేదు.. పట్టుకొచ్చారు!

10

## అలా అంటే కుదరదు కదా!



"నా సినీ ప్రయాణంలో ప్రేమకథలు చాలానే ఉన్నాయి. కానీ ఓ నటిగా నాకు 'తెలుసు కదా' ఇచ్చిన అనుభవం వేరు" అన్నారు కథానాయిక రాశీ ఖన్నా. యువ కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డతో కలిసి ఆమె నటించిన చిత్రమే 'తెలుసు కదా'. శ్రీనిధి శెట్టి మరో కథానాయిక. నీరజ కోన దర్శకులుగా పరిచయం అవుతున్నారు.

12లో..

## తల్లిదండ్రుల చివరి కోరికను నెరవేర్చిన కుమార్తె

ప్రపంచవ్యాప్తంగా ఈ వారం హృదయాలను కదిలించిన ఒక మానవీయ సంఘటన అమెరికా వాషింగ్టన్ రాష్ట్రంలో చోటుచేసుకుంది. ప్రేమ, గౌరవం, ధైర్యం, బాధు all combined in a single emotional chapter of life.

తల్లిదండ్రుల చివరి కోరికను గౌరవిస్తూ, వారిద్దరినీ ఒకే రోజు చివరి ప్రయాణం చేయించిన కుమార్తె కోరిన్ గ్రెగ (Corrine Gregory) ఈ వారం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యారు. ఏడువ దశాబ్దాల ప్రేమయాత్ర డాక్టర్ డ్రూస్ న్యూమన్ (95) మరియు ఆయన భార్య ఈవా న్యూమన్ (92)ం 70 సంవత్సరాలకు పైగా ప్రేమతో, పరస్పర గౌరవంతో కలిసి జీవించిన వృద్ధ దంపతులు.

05వ పేజీలో..

## వెలుగు బాట: రంపచోడవరం

# విద్యా విప్లవం

రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతం... దట్టమైన అడవులు, కొండ కోనలు, సుదూర గిరి శిఖర జనావాసాలు. 1989-90 నాటి ఆ రోజుల్లో, ఇక్కడి గిరిజన పల్లెల్లో 'బడి' అనేది చాలా చోట్ల ఒక స్వప్నం మాత్రమే. విద్యుత్తు లేదు, సరైన రోడ్లు లేవు, ఇక బడి గురించైతే చెప్పేదేముంది? కానీ, ఈ గిరిజన ప్రాంతంలోనే ఒక అద్భుతమైన విద్యా విప్లవానికి నాంది పడింది.




### వ్యవస్థీకరణ: బడి లేని ఊరు ఉండకూడదు!

ఆ విప్లవానికి సారథ్యం వహించిన వ్యక్తి, అప్పటి ఐఏఎస్ అధికారి డాక్టర్ పి.వి. రమేష్. ఆయన ఆధ్వర్యంలో 'స్కూల్ కాంప్లెక్స్ సిస్టమ్' అనే సరికొత్త ఆలోచనకు రూపకల్పన జరిగింది. డి.ఎన్. మూర్తి గారి మార్గదర్శకత్వంలో, కేవలం 11 మండలాలు, 818 జనావాసాలతో కూడిన ఈ ప్రాంతాన్ని 33 విద్యా క్లస్టర్లుగా విభజించారు.





# ప్రపంచ గుర్తింపు: సర్వ శిక్షా అభియాన్‌కు పునాది

**ఈ కార్యక్రమం కేవలం కాగితాలకే పరిమితం కాలేదు. బొమ్మూరు జిల్లా విద్యా శిక్షణా సంస్థ (%ణXజు%) విద్యావేత్తలు, ఏజెన్సీ ఉపాధ్యాయులు అంకితభావంతో రంగంలోకి దిగారు. తొలి అడుగుగా 33 మంది రిసోర్స్ పర్సన్లకు శిక్షణ ఇచ్చి, వారి లక్ష్యాన్ని స్పష్టం చేశారు: బడి లేని ఊరు ఉండకూడదు!**

**ప్రతి సంవత్సరం, గ్రామాలవారీగా 'జనవాస ప్రణాళికలు' రూపొందించారు. వీటిలో జనావాసాల వివరాలు మొదలుకొని, ఉపాధ్యాయులు ప్రయాణించాల్సిన రూట్ ప్లాన్లు వరకు ప్రతి వివరమూ ఉండేది. ఎక్కడ ప్రభుత్వ బడి పెట్టడానికి వీలు లేదో, అక్కడ సమీకృత పాఠశాలలు వెలిశాయి. అలా రంపచోడవరం ఏజెన్సీలో 'బడి లేని ఊరు' అనేది లేకుండా పోయింది.**

**జనావాసాల భాగస్వామ్యం:**

ఈ కృషికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. న్యూయార్క్ లోని యునెస్కో సమావేశం ఈ రంపచోడవరం విద్యా పథకాన్ని ప్రపంచంలోని ఉత్తమ కార్యక్రమాలలో ఒకటిగా ప్రకటించింది. అప్పటి తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ శ్రీ సతీష్ చంద్ర ఐఏఎస్, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీ టి. బాబూరావు నాయుడు, ఎస్.పి.డి. డీ.పీ.ఈ.పీ డా. ఎం. నాగార్జున ఐఏఎస్ వంటి ఉన్నతాధికారుల సమక్షంలో ఈ ప్రగతి వేగంగా ముందుకు సాగింది. ఈ ప్రాజెక్టు ఫలితాలను చూసిన భారత ప్రభుత్వం, రంపచోడవరం నమూనాను పైలట్ ప్రాజెక్టా స్వీకరించింది. కేంద్ర బృందాలు ఇక్కడి బూసిగూడెం కాంప్లెక్స్ను పరిశీలించి, పీఎంఆర్‌సీలో మూడు రోజుల పాటు సమీక్ష జరిపి, ఢిల్లీకి నివేదిక ఇచ్చారు.

## అపురూపమైన ఆప్యాయత

ఈ ఉద్యమంలో గిరిజన సమాజం యొక్క భాగస్వామ్యం అద్భుతం. గ్రామస్తులు స్వచ్ఛందంగా శ్రమదానం చేసి, పాఠశాలల కోసం షెడ్లు నిర్మించారు. అద్భుతమైన సాంఘిక బాధ్యతతో "రోజుకో తల్లి వండిపెట్టు పద్ధతి" ని అమలు చేశారు. ప్రతి రోజు ఒక తల్లి తమ సొంత పిల్లలతో సమానంగా అందరి విద్యార్థులకు ప్రేమగా వండిపెట్టేది. నిస్వార్థంతో కూడిన ఈ ఆప్యాయతను చూసి యునిసెఫ్ ప్రతినిధులు సైతం ఆశ్చర్యం వ్యక్తపరిచారు. 'ఆనందలహరి' విధానంలో చదువును పండుగలా మార్చారు. నిరక్షరాస్యులైన తల్లిదండ్రులు తమ పిల్లల చదువును పర్యవేక్షించడానికి 'మోనటరింగ్ కార్డులు' ఉపయోగించారు. 'చదువు కొత్తలు పండుగ', 'మన్య కళాయాత్ర' వంటి చైతన్య కార్యక్రమాలు విద్య యొక్క విలువను గిరిజనుల హృదయాల్లోకి తీసుకువెళ్లాయి.

## ఆ పర్యవేక్షణ ఫలితమే... సర్వ శిక్షా అభియాన్ పథకం!

2001లో భారత ప్రధాని శ్రీ అటల్ బిహారీ వాజ్ పేయి గారు ఈ పథకాన్ని ప్రారంభించగా, తొలిసారిగా తూర్పుగోదావరి జిల్లాలోని 60 మండలాల్లో అమలు చేశారు. 2002 నాటికి, ఇది దేశమంతా విస్తరించింది. ఒక చిన్న గిరిజన ప్రాంతంలో మొదలైన ఈ విద్యా ఉద్యమం, ఈ రోజు భారతదేశంలోని లక్షల మంది చిన్నారుల భవిష్యత్తుకు బాటలు వేసింది. ఇది గిరిజన జాతికి అంకితమైన విజయం.

**అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు**

అక్టోబర్ 5, అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా, ఈ మహత్తర ఉద్యమానికి వెన్నెముకగా నిలిచిన ఉపాధ్యాయులు, విద్యను ఇంటింటికీ చేర్చడానికి కృషి చేసిన అధికారులు, ముఖ్యంగా ఈ బృహత్తర ప్రణాళికలకు కర్త, కర్మ, క్రియ అయిన డి.ఎన్. మూర్తి గారి నాయకత్వ పటిమను స్మరించుకుందాం.

**"అందరికీ విద్య – అందరిదీ బాధ్యత"** అనే నినాదం... కేవలం మాట కాదు, అది రంపచోడవరం మన్య మట్టిపై మొలకెత్తిన సత్యం.

ఈ స్ఫూర్తిని మరొక్కసారి ప్రజల్లోకి తీసుకువెళ్దాం. వెలుగు బాట ఎప్పటికీ కొనసాగాలి! కొనసాగిద్దాం ...

## తల్లిదండ్రుల చివరి కోరికను

# నెరవేర్చిన కుమార్తె

### "జీవితాన్ని గౌరవంగా ముగించిన ప్రేమకథ"



ప్రపంచవ్యాప్తంగా ఈ వారం హృదయాలను కదిలించిన ఒక మానవీయ సంఘటన అమెరికా వాషింగ్టన్ రాష్ట్రంలో చోటుచేసుకుంది. ప్రేమ, గౌరవం, ధైర్యం, బాధ all combined in a single emotional chapter of life.

తల్లిదండ్రుల చివరి కోరికను గౌరవిస్తూ, వారిద్దరినీ ఒకే రోజు చివరి ప్రయాణం చేయించిన కుమార్తె కోరిన్ గ్రెగరీ (Corrine Gregory) ఈ వారం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యారు.

**ఏడువ దశాబ్దాల ప్రేమయాత్ర**

డాక్టర్ డ్రూస్ న్యూమన్ (95) మరియు ఆయన భార్య ఈవా న్యూమన్ (92) ం 70 సంవత్సరాలకు పైగా ప్రేమతో, పరస్పర గౌరవంతో కలిసి జీవించిన వృద్ధ దంపతులు. కాలక్రమేణా వయోభారం, తీవ్రమైన అనారోగ్యాలు వీరి జీవితాలను బాధాకరంగా మార్చేశాయి.

**వారిద్దరూ ఒక్కసారిగా ఒక నిర్ణయం తీసుకున్నారు**

"మేము ఒకరిని వదిలి మరొకరు జీవించలేము… జీవితం గౌరవంగా ముగించుకోవాలని కోరుకుంటున్నాం."

**మరణంలోనూ కలసి...**

వాషింగ్టన్ రాష్ట్రంలో చట్టబద్ధమైన Medical Aid in Dying (MAID) పథకం ద్వారా వైద్యుల పర్యవేక్షణలో బాధలేని, శాంతియుత మరణం సాధ్యమవుతుంది.

ఈవా మరియు డ్రూస్ తమ కుమార్తె కోరిన్ సహకారంతో అదే మార్గాన్ని ఎంచుకున్నారు.

అక్టోబర్ నెలలో ఒకే రోజు, ఒకే గదిలో, ఒకరినొకరు చేతులు పట్టుకుని చివరి నిద్రలోకి జారుకున్నారు.

ఆ క్షణాలను గుర్తు చేసుకుంటూ కోరిన్ కన్నీరు మున్నీరై చెబుతుంది ం

"అది నా జీవితంలో అత్యంత బాధాకరమైనా, అత్యంత పవిత్రమైన క్షణం.

అమ్మా నాన్న చేతులు పట్టుకుని నవ్వుతూ ఈ లోకాన్ని విడిచారు."

**ప్రేమ, గౌరవం, ధైర్యం కలిసిన నిర్ణయం**

కోరిన్ చెబుతుంది "నా తల్లిదండ్రులు చివరి రోజుల్లో కూడా ఒకరికి ఒకరు ఆశ్వాసనగా ఉన్నారు.

వారు ఒకరినొకరు చూసి 'మనం కలిసి ప్రారంభించాం… కలిసి ముగిద్దాం' అని చెప్పుకున్నారు."

ఆ రోజు ఉదయం వారు తమ ఇష్టమైన పాట విన్నారు, పాత జ్ఞాపకాలను పంచుకున్నారు,

మరి కొద్దిసేపటికే (మెయిడ్) MAID ప్రక్రియ ద్వారా నిద్రలోకి జారుకున్నారు.

**ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశం**

ఈ సంఘటన అమెరికా అంతటా చర్చకు దారితీసింది.

"మరణం కూడా గౌరవంగా జరగాలా?"

"ప్రేమకు చివరి సరిహద్దు ఉందా?"

అనేక ప్రశ్నలు ప్రతిధ్వనించాయి.

కొంతమంది దీన్ని ధైర్యవంతమైన నిర్ణయంగా స్వాగతిస్తే, మరికొందరు దైవాధీన జీవితం మీద మనిషి స్వహస్తాలతో తీసుకుంటున్న నిర్ణయం సరైనదేనా? అని ప్రశ్నిస్తున్నారు.

కానీ కోరిన్ మాత్రం తన తల్లిదండ్రులు కోరుకున్నది నెరవేర్చానని ఒకింత బాధను దిగమింగుకుంటూ ప్రశాంతంగా చెప్పింది

"వారు బాధపడకూడదనే ఒకే కారణంతో నేను వారిని వీడనిచ్చాను. ప్రేమ అంటే వారిని జీవించనివ్వడమే కాదు… వారు కోరుకున్న శాంతిని ఇవ్వడమూ ప్రేమే."

**మనిషి హృదయం చూపించే దిశ**

ఈ కథ మనకు ఏం చెబుతుంది అంటే

ప్రేమ అంటే కేవలం జీవితంలో భాగస్వామ్యం మాత్రమే కాదు,

మరణంలో కూడా పరస్పర అర్థం చేసుకోవడం, గౌరవించుకోవడం.

ఇదే అసలైన ప్రేమకు నిర్వచనం.

డ్రూస్ మరియు ఈవా కథ మానవత్వానికి ఒక స్మారక చిహ్నం.

జీవితం ఒక ప్రయాణమైతే, మరణం ఆ ప్రేమయాత్రకు నిశ్శబ్ద ముగింపు.

Technology



## పక్షవాతం నుంచి బయటపడొచ్చిక...

వెన్నెముక విరిగినా, దెబ్బతిన్నా... పక్షవాతం వచ్చి, చక్రాల కుర్చీకి లేదా పూర్తిగా మంచానికే పరిమితమవుతుంటారు. అలాకాకుండా గాయపడ్డ వెన్నెముక నరాలని తిరిగి పునరుద్ధరించి, ఆ పరిస్థితి నుంచి బయటపడేసే 'పాలీలామినిన్' అనే ఔషధాన్ని కనిపెట్టారు బ్రెజిల్ శాస్త్రవేత్తలు. వెన్నెముక దగ్గర నరాలు చాలా సున్నితంగా ఉంటాయి. ఇవి దెబ్బతింటే తిరిగి మామూలు స్థితికి రావడం దాదాపుగా అసాధ్యం. అందుకే వెన్నెముక సమస్యల కారణంగా కొన్ని లక్షలమంది మంచానికే పరిమితం అవుతున్నారు. దీనికి పరిష్కారంగా మన శరీరంలోనే ఉండే సహజమైన ప్రొటీన్ లామినిన్‌లో కొన్ని మార్పులు చేసి ఈ పాలీలామినిన్ అనే ఔషధాన్ని తయారుచేశారు. దీనికోసం బ్రెజిల్ శాస్త్రవేత్తలు సుమారు పాతికేళ్లపాటు కష్టపడ్డారట. ఈ ఔషధం- ఇటీవలే అయిన గాయాలనే కాకుండా, కొన్నేళ్ల క్రితం చచ్చుబడిన నరాల్లోని కణాల్ని కూడా తిరిగి పునరుద్ధరించి అక్కడ ఒక మెష్‌లాంటి రక్షణ కణజాలాన్ని ఏర్పాటు చేస్తుందట. ఫలితంగా పక్షవాతం నుంచి కోలుకుని తిరిగి నడవొచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

# టీనేజర్లూ.. వైబ్ కోడింగ్ నేర్చుకోండి!

**కేవలం 19 ఏళ్ల వయసులోనే స్కేల్ ఏఐ అనే అంకుర సంస్థను స్థాపించాడు. 24 ఏళ్లలోనే బిలియనీర్‌గా అవతరించి రికార్డు సృష్టించాడు. తాజాగా 28 ఏళ్ల వయసులో ప్రముఖ కృత్రిమ మేధ సంస్థ మెటా ఏఐ సీఈవో బాధ్యతలు చేపట్టి మరోసారి వార్తల్లోకి ఎక్కాడు. అతనే అలెగ్జాండర్ వాంగ్. స్వయంకృషితో వ్యాపారవేత్తగా ఎదిగిన ఆయన ఇటీవల 'వైబ్ కోడింగ్' నేర్చుకోవాలని 13 ఏళ్ల పిల్లలకు సందేశం ఇచ్చారు. ఇంతకీ ఇదేం కోడింగ్? దీని గొప్పతనమేంటి?**



ఇటీవల కృత్రిమ మేధ (ఏఐ) శరవేగంగా విస్తరిస్తోంది. పరిశ్రమలు, విద్య, వ్యాపార రంగాలతో పాటు రోజువారీ వ్యవహారాలనూ పూర్తిగా మార్చేస్తోంది. మనం చేసే పనులు, క్రియేషన్ తీరుతెన్నులనే మారుస్తున్న నేపథ్యంలో కొత్త తరం వీలైనంత త్వరగా ఏఐని అందిపుచ్చుకోవాలని టెక్ కంపెనీలు సైతం ప్రోత్సహిస్తున్నాయి. అలెగ్జాండర్ వాంగ్ తాజా సలహానే దీనికి నిదర్శనం. మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో మధ్యలోనే చదువు ఆపేసిన ఆయన చిన్న వయసులోనే స్కేల్ ఏఐ సంస్థను స్థాపించాడు.

అనతికాలంలోనే బిలియనీర్ వ్యాపారవేత్తగా ఎదిగాడు. నిజానికి ఇదో అద్భుతమైన ప్రస్థానం. ఏఐ వ్యవస్థల శిక్షణలో ప్రాథమిక అంశమైన డేటా లేబులింగ్ మీద స్కేల్ ఏఐ ప్రధానంగా దృష్టి సారించింది. దీన్ని పదేళ్ల పాటు నడిపించిన వాంగ్ తన కౌశలాన్ని మెటా ఏఐకి అందించటానికి నడుం కట్టారు.

ఇటీవల ఆయన ఒక పాడ్‌కాస్ట్‌లో ప్రసంగిస్తూ టీనేజర్ల కళ్లు తెరిపించే సలహా ఇచ్చారు. 'మీరు 13 ఏళ్ల వయసువారైతే మీ సమయమంతా వైబ్ కోడింగ్‌కు వెచ్చించండి. మీ జీవితాన్ని దీంతోనే గడపండి' అని సూచించారు. యువత ఏఐ టూల్స్ కోసం కనీసం 10వేల గంటలైనా అంకితం చేయాలనీ ఉద్బోధించారు. మున్ముందు జాబ్ మార్కెట్‌లో అందరికన్నా ముందుండాలని కోరుకునేవారికిది గొప్ప మేలు చేస్తుందని పేర్కొన్నారు. 'పర్సనల్ కంప్యూటర్లు వచ్చిన తొలినాళ్లలో వాటి కోసం అత్యధిక సమయాన్ని కేటాయించినవారు, వాటితో ఎదిగిన బిల్ గేట్స్, మార్క్ జుకర్‌బర్గ్ వంటివారు భవిష్యత్ ఆర్థిక వ్యవస్థలో గణనీయమైన ప్రయోజనాన్ని పొందారు. ఇప్పుడు అలాంటి సమయమే ఆసన్నమైందని నాకు అనిపిస్తోంది' అని వివరించారు.

గూగుల్, క్లార్నా వంటి సంస్థలూ వైబ్ కోడింగ్‌ను ఉత్పాదకత పెంచుకోవటానికి వాడుకుంటున్నాయి. ఏఐ ప్రోగ్రామింగ్ టూల్స్ కేవలం 20 నిమిషాల్లోనే ప్రోటోటైప్స్‌ను రూపొందిస్తుండటం గమనార్హం. వీటి కోసం గతంలో వారాల కొద్దీ సమయం పట్టేది. వర్ధమాన టెక్ ఉద్యోగులు ఏఐ నైపుణ్యాల మీద పట్టు సాధించటం తక్షణ అవసరంగా మారింది కూడా. ఎందుకంటే కంపెనీలు ఆటోమేషన్‌కు ప్రాధాన్యం ఇస్తుండటంతో ఎంట్రీ లెవల్ టెక్ ఉద్యోగాలు రోజురోజుకీ తగ్గిపోతున్నాయి. ఇది ఉద్యోగ భద్రత మీద ఆందోళనలకూ దారితీస్తోంది. కాబట్టి భవిష్యత్ అవసరాలకు తగినట్టుగా ఇప్పటి నుంచే సన్నద్ధం కావటం అత్యావశ్యకమైంది. ఈ నేపథ్యంలోనే అలెగ్జాండర్ వాంగ్ సలహా ప్రాధాన్యం సంతరించుకుంటోంది.

### వైబ్ కోడింగ్ అంటే?

వైబ్ కోడింగ్ ఓ అధునాతన ప్రోగ్రామింగ్ విధానం. ఇది సహజ భాష, ఏఐ అసిస్టెడ్ టూల్స్ మీద ఆధారపడి పనిచేస్తుంది. సంప్రదాయ కోడింగ్‌కు సంక్లిష్ట ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్ మీద పట్టు ఉండాలి. కానీ వైబ్ కోడింగ్ అలాంటిది కాదు. మామూలు ఇంగ్లిష్‌లో సాధారణ ప్రాంప్ట్ రాయగలిగినా చాలు. ఏఐ టూల్స్ వీటిని ఫంక్షనల్ కోడ్ ప్రాంప్ట్‌ల రూపంలోకి మార్చేస్తాయి. దీని సాయంతో యూజర్లు సొంతంగా రిప్లిట్, కర్సర్ వంటి వేదికల మీద యాప్స్‌ను సృష్టించుకోవచ్చు. టాస్కులను ఆటోమేట్ చేయొచ్చు, వెబ్‌సైట్లు రూపొందించుకోవచ్చు. తమకేం కావాలో వివరంగా వర్ణించగలిగితే చాలు. లోతైన సాంకేతిక పరిజ్ఞానమేమీ అక్కర్లేదు.



● మరియా కొరీనాకు నోబెల్ శాంతి బహుమతి

# అణచివేతకు భయపడని అజ్ఞాతవాసి..

**"నా దేశం కుప్పకూలుతుంటే.. నేను ఇంట్లో కూర్చుని చూడలేను. ప్రజల జీవితాల్లో మార్పు రావాలి. బుల్లెట్ల బదులు బ్యాలెట్లను ఎంచుకుందాం".. దాదాపు పాతికేళ్ల క్రితం మరియా కొరీనా చెప్పిన మాటలివి. నాటి నుంచి ప్రజాస్వామ్య హక్కులను కాపాడటం కోసం ఆమె నిరంతరం పోరాడుతున్నారు. అణచివేతలకు వెరవకుండా ప్రజల తరఫున గళం వినిపిస్తూనే ఉన్నారు. నియంతృత్వ శృంఖలాల నుంచి దేశాన్ని కాపాడేందుకు ఆమె చేస్తోన్న ఈ పోరాటమే.. ప్రతిష్ఠాత్మక 'నోబెల్' పురస్కారాన్ని అందించింది. ఈ విషయాన్ని నార్వే నోబెల్ కమిటీ శుక్రవారం ప్రకటించింది. వెనెజువెలాకు చెందిన మరియా కొరీనా ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడినందుకు గానూ ఈ పురస్కారం లభించింది. అయితే, ఈ అత్యున్నత పురస్కారం కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. ఈ ఏడాది మొత్తం 338 మంది ఈ శాంతి పురస్కారానికి నామినేట్ అవ్వగా.. అకాడమీ సభ్యులు మరియా వైపు మొగ్గుచూపారు.**



"నా దేశం కుప్పకూలుతుంటే..
నేను ఇంట్లో కూర్చుని చూడలేను. ప్రజల జీవితాల్లో మార్పు రావాలి. బుల్లెట్ల బదులు బ్యాలెట్లను ఎంచుకుందాం"..

వెనెజువెలా ప్రజల హక్కుల కోసం అవిశ్రాంత పోరాటం చేసినందుకు గాను మచాడోకు ఈ పురస్కారం ఇస్తున్నట్లు నోబెల్ కమిటీ వెల్లడించింది. నియంతృత్వం నుంచి ప్రజాస్వామ్య సాధన కోసం శాంతి మార్గంలో ఆమె విశేష కృషి చేశారని తెలిపింది. ఈ క్రమంలో మచాడో ఎన్నో బెదిరింపులు ఎదుర్కొన్నారని.. గత ఏడాది కాలంగా అజ్ఞాతంలో జీవించాల్సి వచ్చిందని పేర్కొంది. ఆమె వెనెజువెలా పార్లమెంట్ సభ్యురాలిగా, దేశ విపక్ష నేతగా పనిచేశారు. వెనెజువెలా సైనికీకరణను తీవ్రంగా వ్యతిరేకించిన ఆమె.. శాంతియుత మార్గంలో ప్రజాస్వామ్యం కోసం కృషిచేసి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారని నోబెల్ కమిటీ వెల్లడించింది.

నోబెల్ శాంతి బహుమతిని 1901 నుంచి 105 సార్లు ప్రకటించారు. ఇందులో 111 మంది వ్యక్తులు, 31 సంస్థలు ఇప్పటివరకు ఈ పురస్కారాన్ని అందుకున్నాయి. ఈ అవార్డు అందుకున్న అతిపిన్న వయస్కురాలిగా పాకిస్థాన్‌కు చెందిన హక్కుల కార్యకర్త మలాలా యూసఫ్‌జాయ్ నిలువగా.. జోసెఫ్ రాట్‌బ్లాట్ 86 ఏళ్ల వయసులో దీనిని అందుకున్నారు.

### స్వచ్ఛంద సంస్థతో మొదలై..

మరియా కొరీనా మచాడో 1967 అక్టోబరు 7న జన్మించారు. తల్లి కొరీనా పరిస్కా సైకాలజిస్ట్. తండ్రి హెన్రిక్ మచాడో జులావోగా స్టీల్ వ్యాపారవేత్త. ఆమె పూర్వీకులు వెనెజువెలా స్వతంత్ర పోరాటంలో పాల్గొన్నారు. మరియా ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ, ఫైనాన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేశారు. 1992లో వీధి బాలలు, అనాథ చిన్నారుల కోసం అటెనియా ఫౌండేషన్‌ను స్థాపించారు. అక్కడ పనిచేస్తున్నప్పుడే వెనెజువెలాలో ప్రజాస్వామ్య హక్కుల కోసం గళమెత్తారు. ఆ సమయంలో దేశ ద్రోహం, కుట్ర కేసులను ఎదుర్కొన్నారు.



## ఎవరీ మరియా కొరీనా..?

"నా దేశం కుప్పకూలుతుంటే.. నేను ఇంట్లో కూర్చుని చూడలేను. ప్రజల జీవితాల్లో మార్పు రావాలి. బుల్లెట్ల బదులు బ్యాలెట్లను ఎంచుకుందాం".. దాదాపు పాతికేళ్ల క్రితం మరియా కొరీనా చెప్పిన మాటలివి. నాటి నుంచి ప్రజాస్వామ్య హక్కులను కాపాడటం కోసం ఆమె నిరంతరం పోరాడుతున్నారు. అణచివేతలకు వెరవకుండా ప్రజల తరఫున గళం వినిపిస్తూనే ఉన్నారు. నియంతృత్వ శృంఖలాల నుంచి దేశాన్ని కాపాడేందుకు ఆమె చేస్తోన్న ఈ పోరాటమే.. ప్రతిష్ఠాత్మక 'నోబెల్' పురస్కారాన్ని అందించింది. ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతిని వెనెజువెలా విపక్ష నేత మరియాకు అందిస్తున్నట్లు అకాడమీ ప్రకటించింది.





## మరియా కోరీనాకు నోబెల్ శాంతి బహుమతి అత్యధిక మెజార్టీతో పార్లమెంట్‌కు..

2002లో సుమేట్ అనే స్వచ్ఛంద సంస్థకు సహ వ్యవస్థాపకురాలిగా పనిచేశారు. ఈ సంస్థ ప్రజల ఓటింగ్ హక్కులను కాపాడటం, పారదర్శక ఎన్నికల నిర్వహణ కోసం పనిచేసింది. దాదాపు పదేళ్ల పాటు ఈ స్వచ్ఛంద సంస్థతో కలిసి పనిచేసిన ఆమె.. సొంతంగా 'వెంటే వెనెజువెలా' పేరుతో లిబరల్ పొలిటికల్ పార్టీని స్థాపించారు. 2010లో జాతీయ అసెంబ్లీకి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో అత్యధిక ఓట్లు సాధించి విజేతగా నిలిచిన అభ్యర్థిగా చరిత్ర సృష్టించారు. 2011లో తొలిసారి జాతీయ అసెంబ్లీలో అడుగుపెట్టారు.

## బహిష్కరణకు గురై..

2014 మార్చిలో వెనెజువెలాలో తీవ్ర స్థాయిలో ఆందోళనలు జరుగుతున్న సమయంలో పనామాలో జరిగిన ఆర్గనైజేషన్ ఆఫ్ అమెరికన్ స్టేట్స్ సదస్సులో పాల్గొన్నారు. అక్కడ వెనెజువెలా పరిస్థితిని గురించి ప్రసంగించారు. ఇది స్వదేశంలో పాలకులకు ఆగ్రహం తెప్పించింది. అన్ని రాజకీయ పార్టీల నుంచి ఆమెపై ఒత్తిడి రావడంతో మరో ఏడాది పదవీకాలం ఉండగానే మరియాను జాతీయ అసెంబ్లీ నుంచి బహిష్కరించారు. అనంతరం ఆమెపై పలు కేసులు నమోదు చేశారు.

## నికోలస్ మదురోపై పోటీకి దిగి..

2014 నుంచి 2021 వరకు స్థానిక రేడియో స్టేషన్‌లో ప్రసారకర్తగా పనిచేశారు. రాజకీయ విశ్లేషణలకు సంబంధించిన టాక్‌షోకు హోస్ట్‌గా వ్యవహరించారు. 2023లో మళ్లీ రాజకీయాల్లోకి తిరిగొచ్చారు. ప్రతిపక్ష పార్టీ ప్రైమరీ ఎన్నికల్లో 90శాతం మెజార్టీ సాధించారు. 2024లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో నికోలస్ మదురోకు పోటీగా ఆమె అభ్యర్థిత్వం కూడా ఖరారైంది. కానీ, కేసులు, ఇతరత్రా ఆరోపణలు చూపించి వెనెజువెలా సర్కారు ఆమెపై 15 ఏళ్ల పాటు అనర్హత వేటు వేసింది. దీన్ని ఆ దేశ సుప్రీంకోర్టు కూడా సమర్థించింది. దీంతో అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాన్ని కోల్పోవాల్సి వచ్చింది.





## అజ్ఞాతంలో ఉంటూనే..

అనర్హత కారణంగా వైదొలిగినా ప్రజల పక్షాన పోరాడటం మాత్రం ఆమె ఆపలేదు. ప్రజాస్వామ్య హక్కుల కోసం డిమాండ్ చేస్తూ నియంతృత్వ పాలనపై ఆమె ఆందోళనలు చేపట్టారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది జనవరిలో మరియాను భద్రతా దళాలు అదుపులోకి తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి. ఆ తర్వాత ఆమెను విడిచిపెట్టి, సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు కథనాలు వెలువడ్డాయి. అయితే, నాటి నుంచి ఆమె ప్రజా జీవితంలో కన్పించట్లేదు. కానీ, సామాజిక మాధ్యమాల వేదికగా ప్రజలను చైతన్యపర్చేందుకు పోరాటం చేస్తూనే ఉన్నారు. ప్రజల కోసం ఆమె చూపిన తెగువ ఎంతోమందిలో స్ఫూర్తి నింపిందని నోబెల్ అకాడమీ వెల్లడించింది.

# ట్రంప్‌నకు అంకితమిస్తున్నా

## -మచాదో

తనకు నోబెల్ శాంతి పురస్కారం రావడాన్ని నమ్మలేకపోతున్నానని మచాదో పేర్కొన్నారు. ఎన్నో కష్టాలు పడుతున్న వెనెజువెలా ప్రజలకు, తమ పోరాటానికి మద్దతిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు ఈ అవార్డును అంకితమిస్తున్నట్లు 'ఎక్స్'లో ఆమె ప్రకటించారు. అమెరికా, లాటిన్ అమెరికా ప్రజలు మునుపెన్నడూ లేనంతగా ప్రస్తుతం ట్రంప్‌పై ఆధారపడి ఉన్నారని వ్యాఖ్యానించారు. మరోవైపు– అవార్డు ప్రకటన అనంతరం నార్వేజియన్ నోబెల్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధితో మచాదో ఫోన్‌లో మాట్లాడారు. "మాటలు రావట్లేదు. వెనెజువెలా ప్రజల తరఫున ధన్యవాదాలు. మేము సాధించాల్సింది ఇంకా ఎంతో ఉంది. అందుకోసం తీవ్రంగా కృషి చేస్తున్నాం. తప్పకుండా విజయం సాధిస్తాం. ఇదో ఉద్యమం. నోబెల్ శాంతి పురస్కారానికి ఒంటరిగా అయితే నేను అర్హురాలిని కాదనుకుంటున్నా. ఇది మా సమాజం మొత్తం సాధించిన విజయం. మా ప్రజలకు లభించిన అతిపెద్ద గుర్తింపు" అని పేర్కొన్నారు.



# ‘పాఠశాలల్లో యూపీఐ చెల్లింపులు’.. రాష్ట్రాలకు కేంద్రం లేఖ




మన దేశంలో పెద్దమొత్తంలో డిజిటల్ లావాదేవీలు ( జరుగుతున్నాయి. యూపీఐ వినియోగం విస్తృతమైంది. ఈ క్రమంలోనే పాఠశాలల్లో ఫీజుల వసూలు ప్రక్రియను కూడా ఆధునీకరించాలని కేంద్ర విద్యాశాఖ రాష్ట్రాలను కోరింది. పారదర్శకతను పెంచడంతోపాటు ఫీజుల చెల్లింపును సులభతరం చేసేందుకు యూపీఐ వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించింది. యూపీఐ, నెట్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ చెల్లింపులకు ఆదరణ పెరుగుతున్న వేళ ఇటువంటి ప్రకటన చేయడం ఇదే తొలిసారి.

ఆధునిక విధానాలు అవలంబించడం ద్వారా పాఠశాలల నిర్వహణను సులభతరం చేయడం, ముఖ్యంగా ఆర్థిక లావాదేవీల విషయంలో యూపీఐ (%ఖూ×%) వినియోగాన్ని ప్రోత్సహించాలని కోరుతూ రాష్ట్రాలు, సంబంధిత విభాగాలకు కేంద్ర విద్యాశాఖ లేఖ రాసింది. జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ), సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ), కేంద్రీయ విద్యాలయ సంఘటన్ (కేవీఎస్), నవోదయ విద్యాలయ సమితి (ఎన్‌వీఎస్) వంటివి ఈ జాబితాలో ఉన్నాయి. అడ్మిషన్, ఎగ్జామ్ ఫీజుల వసూలుకు వీలు కల్పించే డిజిటల్ విధానాలను అన్వేషించి అమలు చేయాలని సూచించింది.

నగదు ఆధారిత చెల్లింపుల నుంచి డిజిటల్‌కు మారడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని కేంద్ర విద్యాశాఖ తన ప్రకటనలో పేర్కొంది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఈ విధానం అనుకూలంగా ఉంటుందని, పారదర్శకత సాధ్యమని తెలిపింది. ఫీజుల చెల్లింపునకు స్కూల్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటి నుంచే కట్టొచ్చని చెప్పింది. ‘డిజిటల్ భారత్’ సాధన దిశగా ఇటువంటి చర్యలు తోడ్పడతాయని వెల్లడించింది. ఆర్థిక అక్షరాస్యత మెరుగుదల, తద్వారా డిజిటల్ లావాదేవీలు మరింత విస్తృతం అవుతాయని పేర్కొంది.

# డూమ్స్‌డే కొట్టుకురాలేదు.. పట్టుకొచ్చారు!

రామేశ్వరం సమీపంలోని పాంబన్ మన్నార్ గల్ఫ్ ప్రాంతం నుంచి ఇటీవల చేపల వేటకు వెళ్లిన జాలర్ల వలలో ‘డూమ్స్‌డే’ అనే రకం చేపలు చిక్కాయి. ఇవి 10 కిలోల బరువు, 5 అడుగుల పొడవు ఉన్నాయి. మత్స్యశాఖ అధికారులు మాట్లాడుతూ.. ‘ఈ జాతి చేపలు పొడవుగా, కండగలిగి ఉంటాయి. చారల శరీరం, నారింజ రంగు రెక్కలు వీటి ప్రత్యేకత. ఉప ఉష్ణమండల సముద్రాల్లో చాలా అరుదుగా కనిపిస్తాయి. ఈ చేప ఒడ్డుకు కొట్టుకొస్తే విపత్తు సంభవిస్తుందని జపాన్ సహా ఆసియా దేశాల్లోని మత్స్యకారులు నమ్ముతారు. అందుకే వీటికి ‘డూమ్స్‌డే’ అనే పేరు వచ్చింది. కానీ, అందుకు ఎలాంటి శాస్త్రీయ ఆధారాల్లేవు’ అని వివరించారు.



Food

# నూనె లేకున్నా రుచిగానే..

**పూరీలంత కాకున్నా.. దోశలు కూడా నూనె పీల్చుకుంటాయి. కానీ వీటిని నూనె లేకుండానూ చేసుకోవచ్చు. నూనె సరిపడని వారికి.**



**కావలసినవి:**
బియ్యం – కప్పు, ఇడ్లీ రవ్వ – అర కప్పు, అటుకులు, – కప్పు, మినప్పప్పు – 2 టేబుల్ స్పూన్లు, మరమరాలు – కప్పు, మెంతులు – చెంచా, ఉప్పు – రుచికి తగినంత, అల్లం పచ్చిమిర్చి ముద్ద – చెంచా, మిరియాల పొడి – చెంచా, కొత్తిమీర తరుగు – పావు కప్పు

**తయారీ:**
ఉదయం మినప్పప్పును, బియ్యాన్ని రెండుసార్లు కడిగి నానబెట్టాలి. రాత్రికి కాస్త ఉప్పు, మెంతులు వేసి గ్రైండ్ చేయాలి. అందులో ఇడ్లీరవ్వను జోడించి నాననివ్వాలి. మర్నాడు పొద్దున మరమరాలు, అల్లం పచ్చిమిర్చి ముద్ద, మిరియాల పొడి, కొత్తిమీర తరుగు, తగినన్ని నీళ్లు జతచేయాలి. ఈ పిండితో కాలుతున్న పెనం మీద దోశ వేసి మూత పెట్టాలి. బంగారు రంగులోకి మారిన తర్వాత తిరగేసి మూత పెట్టాలి. ఇలా నూనె లేకుండానే రుచికరమైన దోశలు తయారవుతాయి. అయితే ఈ దోశలు మరీ ఉల్లిపొరల్లా కాకుండా కాస్త మందంగానే ఉండాలి.






# సరోజ పాత్రతో మూవీ అడిగితే.. 'ఘాటి' ఇచ్చారు: అనుష్క



**హైదరాబాద్: నాయికా ప్రాధాన్య చిత్రాల విషయంలో ట్రెండ్ సెట్ చేశారు నటి అనుష్క శెట్టి. మరోసారి అలాంటి బలమైన పాత్రతో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. క్రిష్ దర్శకత్వంలో ఆమె నటించిన లేటెస్ట్ మూవీ 'ఘాటి'. ఈ యాక్షన్ క్రైమ్ డ్రామా సినిమా శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా అనుష్క విలేకరులతో ముచ్చటించారు. ఆ విశేషాలివీ..**

**నటిగా 20 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. 'ఘాటి'లో యాక్షన్ చేయడం ఎలా అనిపించింది?**

అనుష్క: ఇన్నేళ్ల పాటు చిత్ర పరిశ్రమలో కొనసాగుతుండటం ఆనందంగా ఉంది. నేనిప్పటి వరకు నటించని పాత్రను 'ఘాటి'లో పోషించా. అందులో పలు కోణాలుంటాయి. కంఫర్ట్ జోన్ నుంచి బయటకొచ్చి చేసిన సినిమా ఇది. 'అరుంధతి', 'రుద్రమదేవి', 'భాగమతి' పాత్రల్లాగే 'ఘాటి'లోని శీలావతి రోల్ అంత బలమైనది.

**'ఘాటి' కథ విన్నప్పుడు మీ రియాక్షన్ ఏంటి?**

అనుష్క: క్రిష్, రచయిత చింతకింది శ్రీనివాస రావు ఈ కథ చెప్పినప్పుడే నటించేందుకు ఆసక్తి కలిగింది. కథా నేపథ్యానికి తగ్గట్టు తూర్పు కనుమల్లో షూటింగ్ చేశాం. అక్కడకు వెళ్లగానే కొత్త పాత్ర, సంస్కృతి, అద్భుతమైన లొకేషన్స్‌ను ప్రేక్షకులకు చూపించబోతున్నామని అనిపించింది.

**ఈ సినిమాలో గంజాయి అంశం ఉంది కదా. అది ఎలాంటి ప్రభావం చూపనుంది?**

అనుష్క: సామాజికాంశాలు, సమస్యల చుట్టూనే క్రిష్ సినిమా కథలు తిరుగుతాయి. గంజాయి.. సీరియస్ ఇష్యూ. ఈ చిత్రంలో ఓ సందేశం ఉంది.

**'వేదం' తర్వాత క్రిష్ దర్శకత్వంలో నటించిన సినిమా ఇది. అంచనాలపై మీ అభిప్రాయం?**

అనుష్క: కచ్చితంగా సినిమాపై అంచనాలుంటాయి. 'వేదం'లో నేను పోషించిన సరోజ పాత్రకి కొనసాగింపుగా ఒక సినిమా చేద్దామని క్రిష్‌ను అడిగా. అది సహజంగా రాయగలగాలి.. చేయాలనే ఉద్దేశంతో ఏదోటి చేయకూడదని ఆయన అన్నారు. ఆ క్రమంలోనే.. 'ఘాటి' గురించి చెప్పారు.

**ఈ సినిమా కోసం పెద్ద కొండలు ఎక్కేవారట. షూటింగ్ అనుభవం గురించి చెబుతారా?**

అనుష్క: 'ఘాటి' సహా నేను చేసిన చాలా సినిమాలు శారీరక కష్టంతో కూడుకున్నవే. కొత్త లొకేషన్స్‌ను ఆస్వాదించా. 'ఘాటి' షూటింగ్ రోజులు ఎప్పటికీ మర్చిపోలేను.

**విక్రమ్ ప్రభుతో కలిసి నటించడం ఎలా అనిపించింది?**

అనుష్క: ఈ సినిమా ప్రారంభానికి కన్నా ముందే విక్రమ్ ప్రభు నాకు తెలుసు. ఆయన నటించిన 'కుంకీ' సినిమా నాకు చాలా ఇష్టం. మంచి నటుడే కాదు మంచి వ్యక్తి కూడా. 'ఘాటి'లోని దేశీరాజు పాత్రకు చక్కగా సరిపోయారు.

**సోషల్ మీడియాకు దూరంగా ఉండే మీరు ఖాళీ సమయంలో ఏం చేస్తారు?**

అనుష్క: విహారయాత్రలకు వెళుతుంటా. పుస్తక పఠనం ఇష్టం. ప్రస్తుతం మహాభారతం చదువుతున్నా. రెండేళ్లుగా ఫ్యామిలీతో ఎక్కువ సమయాన్ని గడుపుతున్నా
.

**డ్రీమ్ రోల్ ఏంటి? తదుపరి ప్రాజెక్టుల గురించి చెబుతారా?**

అనుష్క: పూర్తిస్థాయి నెగెటివ్ క్యారెక్టర్ ప్లే చేయాలని ఉంది. ప్రస్తుతం మలయాళంలో ఓ సినిమా చేస్తున్నా. తెలుగులో ఓ చిత్రాన్ని అంగీకరించా. త్వరలోనే వివరాలు ప్రకటిస్తా.



# అలా అంటే కుదరదు కదా!

“నా సినీ ప్రయాణంలో ప్రేమకథలు చాలానే ఉన్నాయి. కానీ ఓ నటిగా నాకు ‘తెలుసు కదా’ ఇచ్చిన అనుభవం వేరు” అన్నారు కథానాయిక రాశీ ఖన్నా. యువ కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డతో కలిసి ఆమె నటించిన చిత్రమే ‘తెలుసు కదా’. శ్రీనిధి శెట్టి మరో కథానాయిక. నీరజ కోన దర్శకులుగా పరిచయం అవుతున్నారు. టి.జి.విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈనెల 17న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా రాశీఖన్నా శనివారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతూ... “నేను ఇప్పటివరకూ తెరపై చూడని ఓ సరికొత్త కథాంశంతో రూపొందిన సినిమానే... ‘తెలుసు కదా’. ముక్కోణపు ప్రేమకథే. అయినా ఇందులో ఒక విభిన్నమైన అంశం ఉంది. అదేమిటో తెరపైనే చూసి ఆస్వాదించాలి. నీరజ ఈ కథ చెప్పినప్పుడే నేను చాలా ఆశ్చర్యపోయా. పీపుల్ మీడియా ఫ్యాక్టరీలో నాకు ఇది రెండో చిత్రం. సినిమాకి ఏది కావాలో అది పక్కాగా సమకూర్చే నిర్మాత టి.జి.విశ్వప్రసాద్. చిత్ర పరిశ్రమలో ఏదైనా సరే, దానంతటదే జరగాల్సిందే. మనం ప్రణాళిక వేసుకున్నంత మాత్రాన అలాగే జరుగుతుందని లేదు. నా దగ్గరికి వచ్చిన కథల్లో ఏది బాగుందనిపిస్తే, వాటిని ఎంపిక చేసుకుని ప్రయాణం చేస్తుంటా. నాకు పురాణాల నేపథ్యంలో కథలంటే ఇష్టం, హారర్ నేపథ్యమున్న కథల్లో నటించడం అన్నా, చూడటం అన్నా ఎంతో ఇష్టం. అలాగని అలాంటి కథల్లోనే నేను నటిస్తానని కూర్చుంటే కుదరదు కదా. ఎప్పుడు ఏ పరిశ్రమలో సినిమాలు చేస్తానన్నది కూడా నా చేతుల్లో ఉండదు. తెలుగులో పవన్‌కల్యాణ్ సినిమా ‘ఉస్తాద్ భగత్‌సింగ్’ కోసం దర్శకుడు హరీష్‌శంకర్ ఫోన్ చేయగానే మరో మాట లేకుండా సినిమాకి అంగీకారం చెప్పా. ఆ తర్వాతే కథ విన్నా. పవన్‌కల్యాణ్‌తో కలిసి నటించడం గొప్ప అనుభవం. ప్రస్తుతం హిందీలో నాలుగు ప్రాజెక్ట్‌లు చేస్తున్నా”అని చెప్పింది.



# ఓజీ హీరోయిన్ స్ట్రాంగ్ వార్నింగ్

అందం, అభినయం కలబోసిన హీరోయిన్ ప్రియాంక అరుళ్ మోహన్‌కి టాలీవుడ్ మంచి ఫాలోయింగ్ ఉంది. నాని సరసన ‘గ్యాంగ్ లీడర్’ చిత్రంతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన ఈ చెన్నై బ్యూటీ ఆ తర్వాత శర్వానంద్‌తో ‘శ్రీకారం’, నానితో ‘సరిపోదా శనివారం’ చిత్రాల్లో నటించింది. డాక్టర్ వరుణ్, డాన్ వంటి డబ్బింగ్ చిత్రాలతోనూ ఇక్కడ పాలోయింగ్ పెంచుకుంది. ఆమె క్యూట్ లుక్స్‌కి సోషల్‌మీడియాలో సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉంటుంది. అదే ఏకంగా పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ పక్కన నటించే అవకాశం తెచ్చిపెట్టింది. ఇటీవల వచ్చిన ‘ఓజీ’ చిత్రంలో పవన్ కళ్యాణ్ భార్యగా కన్మణి అనే పాత్రలో ఆకట్టుకుంది ప్రియాంక మోహన్ . ఆ చిత్రం బ్లాక్‌బస్టర్ కావడంతో తెలుగులో ఆమెకు మరిన్ని అవకాశాలు తలుపు తడుతున్నాయి. తెలుగులో ఎప్పటినుంచో సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న ఆమెకు ‘ఓజీ’ రూపంలో మంచి హిట్ లభించింది.

ఈ సంతోషంలో ఉండగానే ప్రియాంక మోహన్‌కి ఊహించని షాక్ తగిలింది. బయట, సినిమాల్లోనూ ఆమె ఎంత పద్ధతిగా ఉంటుందో అందరికీ తెలిసిందే. అలాంటిది సోషల్‌మీడియాలో ఆమె మొహంతో కొన్ని ఫేక్ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. అందులో ప్రియాంక అసభ్యంగా, ఓవర్ ఎక్స్‌పోజింగ్ చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఆ ఫోటోలు చూసిన నెటిజన్లు ప్రియాంక ఇలా మారిపోయిందేంటి అనుకుంటూ వాటిని తెగ షేర్ చేస్తున్నారు. అయితే కొందరు మాత్రం అవి ఫేక్ ఫోటోలని, ప్రియాంక ఎప్పటికీ అలా చేయదని ఆమెకు సపోర్టుగా నిలుస్తున్నారు.

ఈ విషయం ప్రియాంక దృష్టికి వెళ్లడంతో ఆమె ఘాటుగా స్పందిస్తూ ట్వీట్ చేసింది. ‘ఏఐ ద్వారా నన్ను తప్పుగా చూపిస్తూ క్రియేట్ చేసిన ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఏఐ టెక్నాలజీని క్రియేవిటీ కోసం వాడుకోవాలి తప్ప తప్పుడు సమాచారం సృష్టించడానికి కాదు. ఇలాంటి ఫేక్ ఫోటోలు క్రియేట్ చేసేవారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. తమ పైశాచిక ఆనందం కోసం ఎదుటివారిని చులకనగా చూపించేవారిని ఏం చేసినా తప్పులేదని కామెంట్లు చేస్తున్నారు. మంచి కోసం వాడుకోవాలి తప్ప ఇలాంటి చెత్త పనుల కోసం వినియోగిం చడం దారుణమని అభిప్రాయపడు తున్నారు.

# ‘ఫౌజీ’పై అదిరిపోయే అప్‌డేట్స్..



టాలీవుడ్ స్టార్ హీరో ప్రభాస్ వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నాడు. ప్రస్తుతం ఆయన హను రాఘవపూడి దర్శకత్వంలో ఓ పీరియాడిక్ యాక్షన్ డ్రామాలో నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ సినిమాను అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ఇమాన్వి ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తోంది. సినీ వర్గాల సమాచారం ప్రకారం ఇప్పటికే దాదాపు 60 శాతం చిత్రీకరణ పూర్తయింది. ప్రభాస్‌కు సంబంధించిన సన్నివేశాలు ఇంకా 35 రోజులపాటు చిత్రీకరించాల్సి ఉందని తెలుస్తోంది. ఈ చిత్రానికి ‘ఫౌజీ’ అనే పేరు పరిశీలనలో ఉందని టాలీవుడ్ సర్కిల్‌లో చర్చ జరుగుతోంది.రెండో ప్రపంచ యుద్ధ నేపథ్యంలో సాగే ఈ కథలో ప్రభాస్ బ్రిటీష్ ఆర్మీ ఆఫీసర్‌గా కనిపించనున్నాడని తెలుస్తోంది. హను రాఘవపూడి తన సినిమాల్లో భావోద్వేగాలను చక్కగా మేళవించే దర్శకుడిగా పేరుపొందాడు. కాబట్టి ప్రభాస్ యాక్షన్ ఇమేజ్‌తో ఆయన ఎమోషనల్ టచ్ కలిస్తే ప్రేక్షకులకు ఒక కొత్త అనుభవాన్ని అందించే అవకాశముంది. ఈ కథలో యుద్ధం, త్యాగం, దేశభక్తి ప్రధానాంశాలుగా ఉంటాయని వినిపిస్తోంది. ఈ చిత్రాన్ని 2026 ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విడుదల చేయాలని చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడనుంది.ఈ చిత్రానికి సంబంధించి మరో ఆసక్తికర విషయం వినిపిస్తోంది. ‘ఫౌజీ’కి ప్రీక్వెల్ చేయాలనే ఆలోచనలూ నిర్మాతల్లో ఉన్నట్లు సమాచారం. కథ పరంగా విస్తృతమైన ప్రపంచం ఉండటంతో ఈ కథను సిరీస్‌లా కొనసాగించే వీలుందని టాక్ వినిపిస్తోంది. ఇది ప్రభాస్ ఫ్యాన్స్‌కి నిజంగా పండగలాంటి వార్తే. ‘ఫౌజీ’ చిత్రంలో ప్రముఖ నటులు మిథున్ చక్రవర్తి, జయప్రద, అనుపమ్ ఖేర్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సినిమాకు సంబంధించిన సెట్ వర్క్, ఆర్ట్ డైరెక్షన్, కాస్ట్యూమ్ డిజైన్ వంటి అంశాలను అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందిస్తున్నారు. సైనిక నేపథ్యానికి తగినట్లుగా యాక్షన్ సన్నివేశాలు, విజువల్ ఎఫెక్ట్స్ కూడా భారీ స్థాయిలో ఉండనున్నాయి. ఇక ప్రభాస్ ప్రస్తుతం నటిస్తున్న మరో భారీ ప్రాజెక్ట్ ‘ది రాజాసాబ్’ చిత్రీకరణ కూడా చివరి దశలో ఉంది. యూరోప్‌లో మూడు సాంగ్స్ చిత్రీకరించేందుకు యూనిట్ అక్కడికి వెళ్లనుంది. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా 2026 సంక్రాంతి సందర్భంగా జనవరి 9న విడుదల కానుంది.